క్లుప్తంగా

సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థినుల ప్రతిభ



కలెక్టర్ కృతికా శుక్లా నుంచి అవార్డు అందుకుంటున్న కేజీబీవీ ఎస్‌ఓ రాజేశ్వరి

కోటనందూరు: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని కాకినాడ జిల్లా పోలీసు మైదానంలో నిర్వహించిన కల్చరల్ ప్రదర్శనలో అల్లిపూడి కేజీబీవీ పాఠశాలకు జిల్లాలో ప్రథమ బహుమతి లభించింది. కేజీబీవీ విద్యార్థినులు ఇచ్చిన ఉత్తమ ప్రదర్శనను తిలకించిన అధికారులు జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతిని ప్రకటించారు. జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా, ఎస్పీ సతీష్‌కుమార్, ఎంపీ వంగా గీత తదితరులు పాఠశాల ఎస్‌ఓ గోశాల రాజేశ్వరికి మెమెంటో, ప్రశంసాపత్రం అందజేశారు. కేజీబీవీ విద్యార్థినులు 42 మందికి గత మూడు రోజులుగా ఎస్‌ఓ రాజేశ్వరి పర్యవేక్షణలో తర్ఫీదు ఇచ్చారు. చక్కటి ప్రదర్శన ఇచ్చిన విద్యార్థినులను, వారిని తీర్చిదిద్దిన ఎస్‌ఓ రాజేశ్వరిని ఎంపీపీ లగుడు శ్రీనివాసు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చింతకాయల చినబాబు అభినందించారు.

పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం



తునిలో హ్యాండ్ వాష్ మెషీన్‌ను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ సుధారాణి

తుని: ప్రభుత్వం పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తోందని మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణి అన్నారు. తుని మున్సిపల్ కార్యాలయంలో యూనిసెఫ్, పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ సంయుక్తంగా ఏర్పాటు చేసిన హ్యాండ్ వాష్ మెషీన్‌ను శుక్రవారం చైర్‌పర్సన్ సుధారాణి ప్రారంభించారు. ప్రభుత్వం ప్రజలకు అవసరమైన సేవలను అందిస్తోందన్నారు. పురపాలక సంఘం కార్యాలయానికి వచ్చే ప్రజలు, అధికారులు చేతులను శుభ్రం చేసుకునేందుకు ఈ మెషీన్ ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ప్రసాదరాజు, మెప్మా అధికారిణి శ్రీదేవి, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.10 వేల విరాళం

రౌతులపూడి: మండలంలోని గిడజాంలో నూతనంగా నిర్మిస్తున్న గంగాలమ్మతల్లి ఆలయానికి బీసీవై పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ కన్వీనర్ డాక్టర్ అనూష రూ.10,000 విరాళం అందించారు. గిడజాంలో గంగాలమ్మతల్లి ఆలయాన్ని శుక్రవారం ఆమె సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యుడు పడాల గిరిబాబుకు రూ.10,000 నగదును అందజేశారు. ఆలయ అభివృద్ధికి సహకరించిన అనూషకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలపారు. కార్యక్రమంలో బీసీవై పార్టీ నాయుకులు డి.వెంకటరమణ, సీహెచ్ దుర్గా మణికంఠ, జి.వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ



గోకవరంలో విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ సుంకర శ్రీవల్లి, తదితరులు

గోకవరం: విద్యార్థులు ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ సుంకర శ్రీవల్లి సూచించారు. స్థానిక డ్రైవర్స్ కాలనీలోని ఎంపీయూపీ పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థులకు శుక్రవారం ఆమె ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. విద్యార్థులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు సుంకర వీరబాబు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, నరాలశెట్టి నర్సయ్య, తోలేటి రాంప్రసాద్ పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

కాకినాడ రూరల్: మండలం తూరంగి పగడాలపేట వద్ద యానాం నుంచి అక్రమంగా తరలిస్తున్న మద్యాన్ని ఇంద్రపాలెం పోలీసులు పట్టుకున్నారు. గురువారం రాత్రి ట్రైనీ డీఎస్పీ కె.ప్రమోద్, ఎస్సై బి.మణికుమార్, సిబ్బంది పగడాలపేట దగ్గరలో వై.జంక్షన్ వద్ద వాహనాలు తనిఖీ చేశారు. ఈ తనిఖీలో మల్లాడి రాంబాబు అనే వ్యక్తి యానాం నుంచి మద్యం సీసాలు తీసుకువస్తుండగా పట్టుకున్నారు. ఆరు బీర్‌బాటిల్స్, ఒక వైట్‌హోల్, మద్యం ఫుల్ బాటిల్స్ స్వాధీనం చేసుకుని పోలీసులు కేసు నమోదు చేశారు. ఇదే ప్రాంతంలో మరో వాహనాన్ని తనిఖీ చేయగా నర్సాపురం మండలానికి చెందిన తంగెళ్ల నగేష్ నుంచి ఆరు మద్యం ఫుల్‌బాటిళ్లను, రెండు బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు.



తుని ఎంపీడీఓ కార్యాలయంలో జెండా ఎగుర వేస్తున్న నాయకులు



రత్నగిరిపై జాతీయజెండాకు వందనం చేస్తున్న ఈఓ, సిబ్బంది



తునిలో జెండా వందనం చేసిన వాకర్స్ క్లబ్ ప్రతినిధులు

ఆకాశం నిండా మువ్వన్నెల జెండా

- ఘనంగా గణతంత్ర వేడుకలు
- రెపరెపలాడిన జాతీయ పతాకం
- పాఠశాలల్లో సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్న విద్యార్థులు



రౌతులపూడిలో జాతీయ పతాకానికి గౌరవ వందనం చేస్తున్న అధికారులు



తొండంగి మండలం వాకదారిపేట కేజీబీవీలో విద్యార్థుల ప్రదర్శనలు



వీరవరం ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ జెండాకు గౌరవ వందనం చేస్తున్న తోట నరసింహం, తోట రాంజీ

ఏలేశ్వరం/తుని/తునిరూరల్/రౌతులపూడి/కోటనందూరు/ ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్/గండేపల్లి/అన్నవరం/గోకవరం/తొండంగి/జగ్గంపేట/శంఖవరం: భారతదేశ 75వ గణతంత్ర వేడుకలు తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లో శుక్రవారం వైభవంగా జరిగాయి. గ్రామగ్రామాన జాతీయ పతాకం రెపరెపలాడింది. ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. ఏలేశ్వరం మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జ్ ఎంపీడీఓ సూర్యనారాయణ జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, ఎంఈఓ అబ్బాయి, ఎంపీటీసీ సభ్యుడు కొప్పుల బాబ్జీ పాల్గొన్నారు. ఏలేశ్వరం నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ కె.శ్రీనివాసరావు జాతీయ జెండాను ఆవిష్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, వైఎస్సార్ సీపీ నాయకులు శిడగం వెంకటేశ్వరరావు, అలమండ చలమయ్య, దోశీ కిషోర్, సుంకర రాంబాబు పాల్గొని జెండాకు వందనం చేశారు. తుని గణపతినగర్ పార్కులో జాతీయ పతాకాన్ని వాకర్స్ హెల్త్ క్లబ్ జిల్లా గవర్నర్ చదరం శివాజీ ఆవిష్కరించారు. మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ప్రసాదరాజు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లో ఆయా శాఖలకు చెందిన అధికారులు జెండాలను ఆవిష్కరించారు. తుని మండల పరిషత్ కార్యాలయంలో జాతీయ జెండాను ఎంపీడీఓ పి.రవికుమార్ ఎగురవేసి గౌరవ వందనం స్వీకరించారు. మహాత్మగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ డాక్టర్ బొప్పన రాము, వైఎస్సార్ సీపీ మండల మాజీ అధ్యక్షుడు పోతల రమణ, ఎంఈఓ పరవాడ గీతాదేవి, ఏపీఓ పి.నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు. కోటనందూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ, ఈఓపీఆర్డీ జి. అరుణ్‌కుమార్, ఎంపీపీ లగుడు శ్రీనివాసు జాతీయ జెండాను ఎగురవేశారు. జెండాకు గౌరవ వందనం చేశారు. తొలుత మహాత్మగాంధీ, బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గండేపల్లి మండల పరిషత్ కార్యాలయం, ఎంఈఓ కార్యాలయం వద్ద జాతీయ జెండాలను ఎంపీపీ చలగళ్ల దొరబాబు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు మద్దిపట్ల రామకృష్ణ ఆవిష్కరించారు. సర్పంచ్ రుత్తల లలిత, అధికారులు పాల్గొన్నారు. గోకవరం దేవీచౌక్ సెంటర్‌లో పంచాయతీ కార్యదర్శి టంకాల శ్రీనివాస్‌రావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 40 అడుగుల జాతీయ జెండాను ఎంపీపీ సుంకర శ్రీవల్లి, సర్పంచ్ కొమరం శ్రావణి ఆవిష్కరించారు. ఆయా కార్యక్రమాల్లో ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి వరసాల ప్రసాద్, నాయకులు సుంకర వీరబాబు, నరాలశెట్టి నర్సయ్య, తోలేటి రాంప్రసాద్, పులపర్తి బుజ్జి, తదితరులు పాల్గొన్నారు. ప్రత్తిపాడు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో న్యాయమూర్తి కాటం భాను జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు, తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ పీవీవీ గోపాలకృష్ణ, పోలీస్ స్టేషన్ వద్ద సీఐ ఎం.శేఖర్‌బాబు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద సబ్ రిజిస్ట్రార్ టి.సుబ్బారెడ్డి జాతీయ పతాకాలను ఎగురవేశారు. ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, జెడ్పీటీసీ సభ్యురాలు బెహరా రాజరాజేశ్వరి, గ్రామ సర్పంచ్ గుడాల విజయలక్ష్మి, ఎంపీటీసీ సీంద్రపు భాస్కరరావు పాల్గొన్నారు. రౌతులపూడి మండల పరిషత్ కార్యాలయం వద్ద జాతీయ జెండాను ఎంపీడీఓ ఎం.గోవింద్ ఎగుర వేసి గౌరవ వందనం స్వీకరించారు. తొలుత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, జాతిపిత మహాత్మా గాంధీ చిత్ర పటాలకు జెడ్పీటీసీ సభ్యుడు గొల్లు చినదివాణం, ఎంపీపీ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు.

తొండంగి తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ జి.బాలసుబ్రహ్మణ్యం, మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో పసపులేటి సతీష్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. జెడ్పీ వైస్ చైర్మన్ మేరుగు పద్మలత, వైస్ ఎంపీపీ నాగం గంగబాబు, దడాల విజయ్ పాల్గొన్నారు. వాకదారిపేట కేజీబీవీలో ప్రిన్సిపాల్ రాజేశ్వరి ఆధ్వర్యంలో విద్యార్థులు చేసిన ప్రదర్శనలు ఆకర్షణగా నిలిచాయి.

శంఖవరం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ జి.శివరామకృష్ణ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, గాంధీజీ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎంపీపీ పర్వత రాజబాబు, ఎంఈఓ ఎస్‌వీ రమణ, ఈఓపీఆర్డీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరిపై ఘనంగా వేడుకలు

అన్నవరంలోని వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో గణతంత్ర వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయం 8 గంటలకు దేవస్థానం ఈఓ కె.రామచంద్రమూర్తి జాతీయ పతాకాన్ని ఎగురవేశారు. తొలుత జాతిపిత మహాత్మ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈఓ ప్రసంగిస్తూ స్వాతంత్ర సమర యోధుల త్యాగాలను కొనియాడారు. అనంతరం సత్యదేవ డిగ్రీ కళాశాల, జూనియర్ కళాశాల, ప్రభుత్వ కార్యాలయాల వద్ద జాతీయ పతాకాన్ని ఈఓ రామచంద్రమూర్తి ఎగురవేశారు. అన్నవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో జాతీయపతాకాన్ని సర్పంచ్ ఎస్ కుమార్ రాజా ఆవిష్కరించారు. శంఖవరం వైస్ ఎంపీపీ ధారా వేంకటరమణ, ఎంపీటీసీ దడాల సతీష్ పాల్గొన్నారు.

పోరాట యోధుల త్యాగఫలమే గణతంత్రం

కిర్లంపూడి: ఎందరో పోరాట యోధుల త్యాగ ఫలమే గణతంత్ర దినోత్సవమని మాజీ ఎంపీ, జగ్గంపేట వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తోట నరసింహం అన్నారు. వీరవరం ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో జాతీయ జెండాను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. ప్రతిఒక్కరూ దేశభక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పార్టీ యువ నాయకుడు తోట రాంజీ, తోట బాబ్జీ, తోట వేణు, అడారి మహేష్, తోట అయ్యన్న, వేగి రామకృష్ణ, కర్రి వెంకటరమణమూర్తి, ఎంపీడీఓ బడే రాజేశ్వరావు, ఎంఆర్‌ఓ కేవీ మాధవరావు, ఎస్సై పి.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



ప్రత్తిపాడు కోర్టు ఆవరణలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న న్యాయమూర్తి కాటం భాను



కోటనందూరులో జాతీయజెండాను ఎగురవేస్తున్న ఎంపీడీఓ సుబ్రహ్మణ్యశర్మ తదితరులు



ఏలేశ్వరంలో జాతీయ జెండాను ఎగురవేస్తున్న అధికారులు, నాయకులు



గండేపల్లిలో జెండాను ఆవిష్కరించిన ఎంపీపీ దొరబాబు, తదితరులు



గోకవరంలో 40 అడుగుల జాతీయ జెండాకు వందనం చేస్తున్న ఎంపీపీ శ్రీవల్లి, అధికారులు



కాకినాడలో జిల్లా కలెక్టర్ కృతికాశుక్లా, ఎస్పీ సతీష్‌కుమార్ నుంచి అవార్డు అందుకుంటున్న తహసీల్దార్ కుశరాజు, టీపీఓ ఆనంద్‌కుమార్, ఎస్సై సతీష్, రౌతులపూడి డీటీ సత్యనారాయణ, గండేపల్లి ఉద్యానవన అధికారి లావణ్య, తుని హెచ్‌సీ సూరిబాబు, ప్రత్తిపాడు ఎంపీడీఓ కార్యాలయ ఏఓ శ్రీనివాసు, జగ్గంపేట పోలీస్ కానిస్టేబుల్ కృషావరం , ఏవీ నగరం పీహెచ్‌సీ డాక్టర్ భారతి , కిర్లంపూడి ఏఎస్సై కుడిపూడి రామకృష్ణమూర్తి

ఉద్యోగులకు ఉత్తమ సేవా పురస్కారాలు

తుని/ఏలేశ్వరం/కోటనందూరు/రౌతులపూడి/గండేపల్లి/గోకవరం/ప్రత్తిపాడు/తొండంగి/కిర్లంపూడి: గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోని పలువురు ఉద్యోగులు ఉత్తమ సేవా పురస్కారాలకు ఎంపికయ్యారు. కాకినాడలో శుక్రవారం నిర్వహించిన గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ కృతికాశుక్లా, ఎస్పీ చేతుల మీదుగా వీరు అవార్డులు అందుకున్నారు. అవార్డులు పొందిన ఉద్యోగులను ప్రజాప్రతినిధులు అభినందించారు. అవార్డులు పొందిన వారిలో కోటనందూరు తహసీల్దార్ కుశరాజు, ఏలేశ్వరం నగర పంచాయతీ టౌన్‌ప్లానింగ్ అధికారి జేడీ ఆనంద్‌కుమార్, ఏలేశ్వరం ఎస్సై జి.సతీష్, రౌతులపూడి డిప్యూటీ తహసీల్దార్ పీవీవీ సత్యనారాయణ, గండేపల్లి ఉద్యాన అధికారి లావణ్య తుని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్ కె.సూరిబాబు, గోకవరం ఉపాధి ఏపీఓ పి.శేషఅప్పలరాజు, ప్రత్తిపాడు ఎంపీడీఓ కార్యాలయ ఏఓ జె.శ్రీనివాస్, ప్రత్తిపాడు వీర్వో దుర్గాప్రసాద్, జగ్గంపేట పోలీస్ కానిస్టేబుల్ కృషావరం, తొండంగి మండలం ఏవీ నగరం పీహెచ్‌సీ డాక్టర్ భారతి, కిర్లంపూడి ఏఎస్సై కుడిపూడి రామకృష్ణమూర్తి కిర్లంపూడి అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాస్, పోలీస్ కానిస్టేబుల్ ఎం.శ్రీనివాసరావు, తామరాడ ప్రభుత్వోన్నత పాఠశాల ఇంగ్లిషు ఉపాధ్యాయుడు ఆర్ ఏసుబాబు, గండేపల్లి మండలంలో వైద్యాధికారి కేవీఎన్ నరేష్, జూనియర్ అసిస్టెంట్ ఎం.రవికిరణ్ తదితరులు ఉన్నారు.



తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ మాధవీలత నుంచి అవార్డు అందుకుంటున్న గోకవరం ఏపీఓ అప్పలరాజు



కలెక్టర్ కృతికా శుక్లా నుంచి అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు ఏసుబాబు, కిర్లంపూడి అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీనివాస్

వైఎస్సార్ సీపీలో పలువురి చేరిక

ఏలేశ్వరం: శంఖవరం మండలం రాజవరం గ్రామానికి చెందిన పలువురు టీడీపీ శ్రేణులు ఆ పార్టీని వీడి శుక్రవారం వైఎస్సార్ సీపీలో చేరారు. మండలంలోని లింగంపర్తిలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు సమక్షంలో వైఎస్సార్ సీపీలోకి చేరారు. వారికి కో ఆర్డినేటర్ సుబ్బారావు కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేయాలని వరుపుల వారికి సూచించారు. పార్టీలో చేరిన వారిలోవనసంరక్షణ సమితి చైర్మన్ తొంటా నూకరాజు, తొంటా దేవుళ్లు, కాబోజీ ధర్మరాజు, విద్యా కమిటీ చైర్మన్ కాబోజీ లక్ష్మణరావు, మొసర సత్యనారాయణ, తోట నాగు, మీసం లోవరాజు, తదితరులు ఉన్నారు.



లింగంపర్తిలో పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న కోఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

దేవస్థానం హైస్కూల్‌కు కంప్యూటర్ బహూకరణ

అన్నవరం: స్థానిక వీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానం హైస్కూల్‌కు పూర్వ విద్యార్థులు కంప్యూటర్ బహూకరించారు. హైస్కూల్‌కు చెందిన 2001-2002 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు శుక్రవారం రిపబ్లిక్ డే సందర్భంగా జాతీయ జెండా ఆవిష్కరణకు వచ్చిన దేవస్థానం ఈఓ కె.రామచంద్రమోహన్‌కు కంప్యూటర్‌ను అందచేశారు. హైస్కూల్ హెచ్‌ఎం అల్లాడ వెంకటేశ్వరరావు, పీఈటీ పర్వత వీరేష్, పూర్వవిద్యార్థులు డి.కుమార్, వరప్రసాద్, కె. శ్రీకాంత్, పి.గంగారమణ, భగవాన్, వినోద్ కుమార్, పి.దేవి, సీహెచ్ అపర్ణ, టి.సరస్వతీ పాల్గొన్నారు.



దేవస్థానం ఈఓ రామచంద్రమోహన్‌కు కంప్యూటర్ అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

తాగునీరు వృథా

ఏలేశ్వరం: స్థానిక పోలీస్‌స్టేషన్ సమీపంలోని ఓవర్ హెడ్ ట్యాంక్, జీఎల్‌ఆర్ ట్యాంకుల నుంచి తాగునీరు వృథాగా పోతోంది. పైపులైన్ దెబ్బతినడంతో ట్యాంకుల నుంచి రోజుల తరబడి తాగునీరు వృథాగా పోతోంది. సమస్యను పరిష్కరించాల్సిన అధికారులు నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులు స్పందించి తాగునీరు వృథా పోకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



జీఎల్‌ఆర్ ట్యాంక్ నుంచి వృథాగా పోతున్న తాగునీరు

నూతన కార్యవర్గం ఎన్నిక

తుని: తుని చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా సకురు నాగేంద్ర నెహ్రూ ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రస్తుత అధ్యక్షుడు కుసుమంచి సుబ్బరాయులు తెలిపారు. స్థానిక బాడవతోటలోని చాంబర్ ఆఫ్ కామర్స్ కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం కార్యవర్గ సమావేశం సుబ్బరాయులు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సంఘ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యదర్శితో పాటు ఉపాధ్యక్షులు, కోశాధికారి, సహాయ కార్యదర్శి తదితర పదవులకు సభ్యులను ఎంపిక చేశారు. నూతన కార్యవర్గం త్వరలోనే ప్రమాణ స్వీకారం చేస్తుందని సుబ్బరాయులు తెలిపారు.

మద్యం సీసాల స్వాధీనం

రౌతులపూడి: గ్రామంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని నుంచి 30 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు తుని సెబ్ ఎస్‌ఐ చిట్టిబాబు తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తామన్నారు. ఎస్.అగ్రహారంలో సారా విక్రయిస్తున్న వీరబాబును అరెస్టు చేసి అతని వద్ద నుంచి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్టు రౌతులపూడి ఎస్‌ఐ అబ్దుల్ నబీ తెలిపారు.

పార్టీ విజయానికి కృషి చేయాలి

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ వరుపుల సుబ్బారావు

ఏలేశ్వరం: వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ ప్రత్తిపాడు నియోజకవర్గ కో ఆర్డినేటర్, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు పిలుపునిచ్చారు. మండలంలోని లింగంపర్తిలో శుక్రవారం రౌతులపూడి మండలం కొత్తూరు, రాఘవపట్నం, సత్యవరం గ్రామాలకు చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలన్నారు. సీఎం జగన్ పాలనలో అన్నివర్గాల ప్రజలకూ లబ్ధి చేకూరిందన్నారు. ప్రజలకు మరింత మేలు జరగాలంటే జగన్‌ను మళ్లీ సీఎం చేయాలని కోరారు. కార్యక్రమంలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



లింగంపర్తిలో వరుపులను కలిసిన రౌతులపూడి మండల వైఎస్సార్ సీపీ నాయకులు

త్రుటిలో తప్పిన పెను ప్రమాదం

గండేపల్లి: జాతీయ రహదారిపై శుక్రవారం కారు టైరు పేలిన ఘటనలో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. రోడ్డు సేఫ్టీ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం...జాతీయ రహదారిపై హైదరాబాద్ నుంచి అన్నవరం వెళుతున్న కారు మండలంలోని మల్లేపల్లి శివారుకు వచ్చే సరికి కారు వెనుక భాగంలోని టైరు పేలిపోయింది. దీంతో కారు అదుపుతప్పి డివైడర్‌పైకి దూసుకుపోయింది. అదృష్టవశాత్తు కారులో ప్రయాణిస్తున్న వారికి ఎటువంటి గాయాలు కాలేదు.

వనదుర్గ అమ్మవారికి చండీ హోమం

అన్నవరం: రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి శుక్రవారం చండీ హోమం నిర్వహించారు. ఆలయ పండితులు ఉదయం తొమ్మిది గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి హోమం ప్రారంభించారు. 11 గంటలకు హోమగుండంలో హోమ ద్రవ్యాలను సమర్పించి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజన మంత్ర పుష్పాలు సమర్పించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. వేద పండితులు ముష్టి పురుషోత్తం, సుధీర్, కోట వంశీ, కూచుమంచి ప్రసాద్ తదితరులు హోమం జరిపారు. 20 మంది భక్తులు రూ.750 చొప్పున టిక్కెట్లు కొనుగోలు చేసి హోమంలో పాల్గొన్నారు.

అమ్మవార్లకు లక్ష కుంకుమార్చన

ప్రధానాలయంలో సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీసత్యవతీదేవి అమ్మవారికి ఆలయ ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలోనూ, కొండదిగువన కనకదుర్గ అమ్మవారికి ఆలయ అర్చకుడు కంచిబట్ల సాయిరామ్ ఆధ్వర్యంలోనూ పండితులు లక్ష కుంకుమార్చనలు నిర్వహించారు.



రత్నగిరిపై వనదుర్గ అమ్మవారికి చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు